క్లుప్తంగా

కార్మికులకు అల్పాహారం పంపిణీ



చేతి సంచులను అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పేరాల చిన్నరథం సెంటర్‌లో యాచకులకు, రిక్షా కార్మికులకు, పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారాన్ని అందించారు. ప్రతి నెల రెండో శనివారం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారాన్ని అందిస్తున్నారు. అనంతరం చేతి సంచులను అందిరికి పంచిపెట్టారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తూ ప్రతి ఒక్కరూ చేతి సంచులను వాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు చుండూరి కృష్ణమూర్తి, కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, ప్రతినిధులు తడవర్తి చంద్ర, కె.రామారావు, ఎస్‌జీవీ ప్రసాదరావు, మణిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోగల రాజ్యలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో విజయదశమి పండగను పురస్కరించుకొని శనివారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని పెండ్లి కూమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి వారికి 26 మంది దంపతులు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



108 కోసం ఎదురు చూస్తున్న ఎస్సై

వేటపాలెం: మోటార్ బైక్‌పై వేంగంగా వెళ్తూ అదుపుతప్పి కింద పడిపోవడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన వేటపాలెం సెంటర్ నుంచి బైపాస్‌కు వెళ్లే కుందేరు ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. బాపట్లకు చెందిన యువకుడు చెరువుల దగ్గర కూలి పనులు చేసుకుంటున్నాడు. వేటపాలెం నుంచి బైపాస్ రోడ్డుకి వెళ్తూ బైక్ అదుపుతప్పి కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. అదే సమయంలో వెనక వస్తున్న ఆటో యువకుడిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడికి ప్రథమ చికిత్స చేసి 108లో చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసిన ఎస్సైని పలువురు అభినందించారు.



కారంచేడులో గంగమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కోలలపూడి గ్రామంలో దుర్గాదేవిని ఊరేగిస్తున్న భక్తులు



గొర్రెపాడులో అమ్మవార్ల వేషధారణతో ప్రారంభమైన గ్రామోత్సవం

శమీ శమయతే పాపం..

- చివరిరోజు రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు
- శమీ వృక్షాలకు ప్రత్యేక పూజలు
- ముగిసిన దసరా శరన్నవరాత్రులు

కారంచేడు/చినగంజాం/యద్దనపూడి/మార్టూరు: విజయానికి, సకల శుభాలకు చిహ్నమైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించటం శుభప్రదమని భక్తుల విశ్వాసం. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పరమ శాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ ఒక చేతిలో చెరుకుగడ, మరో చేతిలో అభయముద్రతో భక్తులకు దర్శనమిచ్చింది. యద్దనపూడి మండలం జాగర్లమూడిలోని ఉజ్జయినీ మహంకాళీ, గన్నవరం కాశీ అన్నపూర్ణాదేవి, పూనూరు త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయాల్లో శమీ వృక్ష పూజ, తెప్పోత్సవం, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేసి, జమ్మిచెట్టు ఆకుతో పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారు.

■ తొమ్మిది రోజులు పాటు తొమ్మిది అవతారాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మండల కేంద్రమైన కారంచేడు వైష్ణవీ దుర్గాలయం, పెదబజారు శివాలయం, సాయిమందిరం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం, మాధవస్వామి గుడి, మండలంలోని స్వర్ణ, కుంకలమర్రు, దగ్గుబాడు, కొడవలివారిపాలెం గ్రామాల్లోను అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం రాత్రికి చెరువుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తెప్పోత్సవం నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవంలో భక్తులు శూలాలు గుచ్చుకొని నృత్యం చేశారు.

■ మార్టూరులో దుర్గా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో, స్థానిక బొడ్డురాయి సెంటర్లోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, బలరాం కాలనీలోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ఆలయంలోనూ ఇతర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలలపూడి గ్రామంలో నీలకంఠేశ్వర, చెన్నకేశవస్వామి, దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. మహిళలు దుర్గాదేవికి బోనాలు సమర్పించారు.



అద్దంకిలో నగరోత్సవంలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవి..



అద్దంకి వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి నగరోత్సవంలో వేషధారణలో కళాకారులు



నూతలపాడులో అలంకరణలో అమ్మవారు

అమ్మవారి విగ్రహాల నిమజ్జనం..

అద్దంకి రూరల్/బల్లికురవ/మేదరమెట్ల/జే.పంగులూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సావాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవార్లను చివరిరోజు నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రం, పోలేరమ్మ దేవస్థానం, వేయిస్తంభాల దేవస్థానం, పాత శివాలయం, శింగరకొండ గాయత్రిదేవి ఆలయం, మణికేశ్వరం శివాలయం, పలు శివాలయాల్లో అమ్మవార్లను రాజరాజేశ్వరీ దేవిగా అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యల అమ్మవారిని దర్శించుకున్నారు.

■ బల్లికురవ మండలం చెన్నుపల్లి, కొండాయపాలెం, కొణిదెన, బల్లికురవ, నక్కబొక్కలపాడు, చిన్నఅంబడిపూడి గ్రామాల్లో అలంకరణలతో పాటు విశిష్ట పూజలు, రాత్రికి భజనలతో హోరెత్తించారు. గొర్రెపాడు గ్రామంలో వేంచేసియున్నపాత అంకమ్మ, కొత్త అంకమ్మ ఆలయాల్లో అమ్మవార్ల వేషధారణలతో గ్రామోత్సవాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి సిబ్బందితో శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

■ పంగులూరులో సచివాలయం సమీపంలో దసరా నవరాత్రులు ఎంతో ఘనంగా నిర్వహించారు. దసరా పండగ సందర్భంగా మహిళలచే కోలాటం నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించి, సముద్రంలో నిమజ్జనం చేశారు.

పూజలు చేసిన ప్రజాప్రతినిధులు..

చీరాల అర్బన్: విజయదశమి సందర్భంగా శనివారం రాత్రి దేవాలయాల్లో పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్వేట ఉత్సవాన్ని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలోని ప్రాంగణంలో నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాలలో ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరించి శమీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దంపతులు పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. అలానే బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పార్వేట ఉత్సవంలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశఋూరు. పేరాలలోని పలు ప్రాంతాలలో విజయదశమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వీరరాఘవస్వామి దేవాలయంలో విజయదశమి సందర్భంగా శమీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రాజరాజేశ్వరీగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి వేదవతి భాగవతారిణి హరికథా గానం చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆదిపూడి మోహన్ కృష్ణ, వల్లభ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, లింగమగుంట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పంగులూరులో కోలాటం ఆడుతున్న మహిళలు



పూనూరులో శమీ వృక్ష పూజ చేస్తున్న అర్చకులు



పంగులూరులో నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు



ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు



గోమాతలకు పూజలు నిర్వహిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

విస్తారంగా కురుస్తున్న వర్షాలు



తిమిడెదపాడు-స్వర్ణ గ్రామాల మధ్యన ప్రవహిస్తున్న ఆలేరు వాగు



తిమిడెదపాడు గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కారంచేడు: తుఫాను ప్రభావంతో గత మూడు రోజుల నుంచి వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో మండలంలోని తిమిడెదపాడు, ఆదిపూడి, కారంచేడు, స్వర్ణ గ్రామాల్లోని లోతట్టు ప్రాంత రహదారులు జలమయంగా మారుతున్నాయి. మండల కేంద్రం కారంచేడుతో పాటు ఎగువున ఉన్న యద్దనపూడి, పర్చూరు ప్రాంతాల్లో కురుస్తున్న అధిక వర్షాలతో వాగులు సైతం పొంగి పొర్లుతున్నాయి. స్వర్ణ-తిమిడెదపాడు గ్రామాల మధ్యన ఉన్న అలుగు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తిమిడెదపాడు నుంచి దగ్గుబాడు, కొడవలివారిపాలెం, ఇంకొల్లు ప్రాంతాలకు రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఈ రహదారిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పికెట్లు ఏర్పాటు చేశారు. రాకపోకలను నిలిపివేసేలా వాగుకు ఇరువైపులా ముళ్ల కంపలను వేశారు. గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా మురుగుకాలువల నిర్మాణాలు లేకపోవడం వలన మురుగు ప్రవహించే మార్గం లేక రోడ్లపైనే నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోడవంతో ఈ సమస్యలు వచ్చాయని తిమిడెదపాడు గ్రామస్తులు వాపోతున్నారు.

నేటి నుంచి గ్రామాల్లో పల్లె పండుగ

జే.పంగులూరు/బల్లికురవ: నేటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె స్వరూపరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నేటి నుంచి 20వ తేది వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో సభలు నిర్వహించి మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకంలో పారదర్శకంగా నిర్వహించేలా చేయాలని తెలిపారు. నేడు నూజిళ్లపల్లి, చందలూరు, టీ తక్కెళ్లపాడు, టీ కొప్పెరపాడు, 15న అలవలపాడు, రేణింగవరం, కశ్యాపురం గ్రామాల్లో, 16న జాగర్లమూడివారిపాలెం, ముప్పవరం, కొండమూరు, 17న బైటమంజులూరు, భగవాన్‌రాజుపాలెం, రామకూరు, 18 న కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, 19న బూదవాడ, కల్లంవారిపాలెం, చిన్నమల్లవరం, 20న ఆరికట్లవారిపాలెం, పంగులూరు గ్రామాల్లో నిర్వహిచనున్నట్లు తెలిపారు.

■ బల్లికురవ మండలంలోని అన్ని పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి ప్రకటనలో తెలిపారు. నేడు సోమవారం వేమవరం, ఉపమాగులూరు, కొప్పెరపాలెం, 15వ తేదీన బల్లికురవ, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, 16న గుంటుపల్లి, పెదంబడిపూడి, వల్లాపల్లి, 17న కొమ్మినేనివారిపాలెం, వైదన, ముక్తేశ్వరం. 18న వెలమవారిపాలెం, కొత్తూరు, కొప్పెరపాడు. 19న ఎస్ ఎల్ గుడిపాడు, గొర్రెపాడు, కూకట్లపల్లి, కే రాజుపాలెం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు.

కారంచేడు: నేటి నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జరుబులవారిపాలెం, మధ్యాహ్నం నాయుడువారిపాలెం, 16వ తేదీ ఉదయం పోతినవారిపాలెం, మధ్యాహ్నం దగ్గుబాడు. 17వ తేదీన ఉదయం స్వర్ణ, మధ్యాహ్నం రంగప్పనాయుడువారిపాలెం. 18న ఉదయం కొడవలివారిపాలెం, మధ్యాహ్నం కేశవరప్పాడు. 19న ఉదయం తిమిడెదపాడు, మధ్యాహ్నం ఆదిపూడి. 20వ తేదీ ఉదయం కారంచేడు, మధ్యాహ్నం కుంకలమర్రు గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

చెత్తశుద్ధి ఎక్కడ సారూ ?

- కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- చీరాల మున్సిపాలిటీ, వేటపాలెం మండలాల్లో పారిశుద్ధ్యం అధ్వానం

చీరాల టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి కూర్చున్నాయి. కేవలం కాగితాల్లోనే అభివృద్ధి చూపిస్తున్నారు కాని క్షేత్రస్థాయిలో మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి, చెత్తకుప్పలు లేకుండా చూడాలని మన పాలకులు తరచూ అధికారులకు చెప్పే మాటలివే. కానీ అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, మండలానికి ఎంపీడీవో, నియోజకవర్గానికి ప్రత్యేకాధికారి ఉన్నప్పటికీ గ్రామాల్లో పరిశుభ్రత ఏమాత్రం కానరావడం లేదు. ఫలితంగా గ్రామాలన్నీ చెత్తాచెదారాలు, వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

ఎక్కడా చూసినా చెత్తకుప్పలే..

చీరాల టౌన్, రూరల్, వేటపాలెం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎక్కడా చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్యవ అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెంలో 9 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచి ఉంటుంది. గ్రామాల్లోకి ఎవరైనా జిల్లా అధికారో, ప్రజాప్రతినిధులు వస్తే మాత్రం కేవలం ఆపరిసరాలను మాత్రం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో చెత్తను తీసేసే వారే లేకపోయారు. మండలంలోని దేవాంగపురి, ఈపూరుపాలెం, గవినివారిపాలెం, వాడరేవు గ్రామాలు జనాభాపరంగా, ఆదాయపరంగా ఎక్కువైనవి, కానీ ఈ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అరకొరగా ఉండటంతో వీధుల వెంట చెత్తాచెదారాలు కనిపిస్తూనే ఉన్నాయి. చీరాల మండలంలో మిగిలిన దేవినూతల, కావూరివారిపాలెం, బుర్లవారిపాలెం, చీరాలనగర్, కొత్తపాలెం, విజయనగర్‌కాలనీ, తోటవారిపాలెం, రామకృష్ణాపురం, సాల్మన్ సెంటర్, గాంధీనగర్ గ్రామ పంచాయతీలు చిన్న గ్రామాలు. ఈ గ్రామ పంచాయతీల్లో సమస్యలు నృత్యాలు చేస్తున్నాయి. రికార్డుల్లో మాత్రం పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పి నిధులు డ్రా చేసుకుంటున్నారు. కాని క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలను గాలికొదిలేశారు. ఫలితంగా ప్రజలు దోమల దాడి, దుర్వాసనలతో నారోగ్యాలకు గురై ఆసుపత్రుల్లో చేరి వైద్య సేవలు పొందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



గవినివారిపాలెంలో మురుగునీరు పేరుకుపోయి అధ్వానంగా మారిన రోడ్డు



బోయినవారిపాలెం గ్రామంలో కదలని మురుగునీటి కాలువ

నవంబర్ 16 నుంచి కడప దర్గా ఉరుసు ఉత్సవాలు

పర్చూరు (చినగంజాం): నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు ప్రఖ్యాతిగాంచిన కడప అమీన్ పీర్ దర్గాలో నిర్వహించే ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనాలని పీఠాధిపతి ఆరిఫుల్లా మాలిక్ ముస్లింలకు పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో పాల్గొన్న వారిపై అల్లా దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. స్థానిక ముస్లింలను ఆహ్వానించేందుకు ఆదివారం ఆయన అనుచరుడైన షేక్ కాలేషా ఇంటకి వచ్చారు. నవంబర్ 16వ తేదీన కడప అమీన్ పీర్ దర్గాలో జరిగే గంధం ఉత్సవాల్లో అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. జాతీయస్థాయిలో కడప దర్గా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని వివరించారు. ఈఅవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ అహమద్ బాషా, షేక్ ఖజావలి, షేక్ మస్తాన్ వలి, అమానుల్లా, సలీమ్, షేక్ బుల్లా మెస్త్రీ, షేక్ మహబూబ్ బాషా, షేక్ గౌస్, షేక్ హామది, షేక్ రఫీ, అమన్, ఆసిమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ



పూజ నిర్వహిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

చినగంజాం: దసరా పురస్కరించుకొని చినగంజాం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐ శీలం రమేష్ విజయదశమి సందర్భంగా పూజలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని సిబ్బందితో కలిసి ఆయన ఆయుధ పూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా పండితుల మంత్రాల నడుమ పూజ నిర్వహించి ప్రసాదాలు పంచి పెట్టారు.

ఆశావహుల్లో అదృష్టవంతులెవరో ?

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వ నూతన మద్యం పాలసీ ప్రకారం కొత్త షాపుల కోసం దరఖాస్తు చేసుకొన్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తు దారులకు సంబంధించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నేడు సోమవారం లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించనున్నారు. పర్చూరు నియోజకవర్గంలో మొత్తం 20 వైన్ షాపులకు గాను 548 దరఖాస్తులు వచ్చాయి. మార్టూరులో 6 షాపులకు అత్యధికంగా 190 దరఖాస్తులు రావడంతో ఆశావహుల్లో పోటీ ఏ మాత్రం నెలకొని ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఒక్కొక్కరు రూ. 2 లక్షల నాన్ రిఫండబుల్ మొత్తం చెల్లించి 20కి పైగా దరఖాస్తులు సమర్పించారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కటి తగిలినా నష్టం లేకుండా రెండేళ్లలో కోట్లు సంపాదించుకోవచ్చనేది వారి ధీమా. దరఖాస్తు చేసుకున్న వారిలో కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులే ఎక్కువ మంది ఉండటం గమనార్హం. లాటరీలో ఇతరులకు షాపులు దక్కినా వారితో తరువాత మాట్లాడుకోవచ్చనే గట్టి ధీమాతో కూటమి నాయకులు ఉన్నట్లు సమాచారం.